India Media Monitor

# Eenadu

## Requires social responsibility for businessmen

**Date: 19/12/2013 | Edition: Hyderabad | Page: 8 | Source: Bureau | Clip size (cm): W: 10 H: 15**

**Clip: 1 of 1**


# వ్యాపారవేత్తలకు సామాజిక బాధ్యత అవసరం

- రాష్ట్ర గవర్నర్ నరసింహన్
- టై హైదరాబాద్ ఎంటర్‌ప్రెన్యూరల్ సమ్మిట్ ప్రారంభం

మాదాపూర్, న్యూస్‌టుడే: ఔత్సాహిక వ్యాపారవేత్తలు కేవలం ధనార్జనే లక్ష్యంగా కాకుండా సామాజిక బాధ్యతతో ముందుకువెళ్లాలని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ సూచించారు. విద్యా వైద్య వ్యవసాయరంగాలపై ప్రధాన దృష్టి సారించి సరికొత్త ఆవిష్కరణలతో సామాన్యుడికి ఉపయోగపడే వ్యాపారం చేయాలన్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో హెచ్‌ఐసీసీలో ఏర్పాటు చేసిన 'టై హైదరాబాద్ ఎంటర్‌ప్రెన్యూరల్ సమ్మిట్'కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారవేత్తలు అంకితభావంతో పనిచేస్తేనే మంచి ఫలితాన్ని అనుభవించవచ్చన్నారు. సరికొత్త ఆలోచనలతో ఉండే ఉద్యోగుల్లో విశ్వాసాన్ని పెంపొందించి కంపెనీ యాజమాన్యం తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. మన విద్యావ్యవస్థలో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉందని, ఏటా లక్షలాది మంది పట్టాలు పుచ్చుకొని బయటకు వస్తున్నా.. వారికి వృత్తినైపుణ్యం ఉండటం లేదన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఇంజినీర్ దరఖాస్తు చేసుకుంటున్నారని చెప్పారు. స్పీకర్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఆరోగ్య, పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. టై హైదరాబాద్ అధ్యక్షులు మురళి బుక్కపట్నం మాట్లాడుతూ రెండు రోజుల పాటు కొనసాగే ఈ సదస్సు ఔత్సాహిక వ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రులు గీతారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ యాండ్రీవ్ మెక్‌ఎలిస్టర్, టై హైదరాబాద్ ప్రతినిధులు శ్రీనిరాజు, టాలెంట్ స్ప్రింట్ ఛైర్మన్ జె.ఎ.చౌదరి తదితరులున్నారు.



బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో 'టై' సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో గీతారెడ్డి, నాదెండ్ల మనోహర్, పొన్నాల లక్ష్మయ్య తదితరులు